క్లుప్తంగా

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కమిటీ ఎన్నిక



అధ్యక్షుడిని అభినందిస్తున్న న్యాయవాదులు

కోదాడరూరల్ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కోదాడ నూతన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సెక్రటరీ సీహెచ్.రాంరెడ్డి ఆధ్వర్యంలో కోదాడలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్.అబ్దుల్‌రహీం, ఉపాధ్యక్షుడిగా కో దూరు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీ చలం, జాయింట్ సెక్రటరీగా ఆవుల మల్లికార్జున్, కోశాధికారిగా చెన్న పెద్దబ్బాయి, మహిళ ప్రతినిధిగా వి.రాంబాయితో పాటు సభ్యులుగా నవీన్‌కుమార్, సుల్తాన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, సీనియర్ న్యాయవాది కాకర్ల వెంకటేశ్వరరావు, దొడ్డా శ్రీధర్, మురళీ, నవీన్, బాల నరసయ్య తదితరులు ఉన్నారు.

టీవీ బహూకరణ



ప్రభుత్వ పాఠశాలకు టీవీ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ విద్యా బోధనకు అదే పాఠశాలలో 2018– 19 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం రూ.10 వేలు విలువ గల టీవీని బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, పూర్వ విద్యార్థులు సైదులు, నాగరాజు, వెంకన్న, దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు వీరబాబు, రషీద్‌ఖాన్, జానకిరాములు, వెంకటేశ్వర్‌రావు, నర్సింహారావు, భానుమతి, జానయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, విజయలక్ష్మి, సరస్వతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

18న రేషన్ బియ్యం బహిరంగ వేలం

మేళ్లచెరువు : మండల కేంద్రంలో ఓ రేషన్ డీలర్ అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గతంలో సివిల్ సప్లయ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 18న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం కొనదలిచిన వారు ట్రేడింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ధరావత్ కింద రూ.4000 డీడీ రూపంలో చెల్లించాలని తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నేరేడుచర్ల : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి జావెద్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

పాఠశాల పరిశీలన



టీవీని ప్రారంభిస్తున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి : మండలంలోని సర్వారం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ చత్రునాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యా బోధన తీరును పరిశీలించారు. అనంతరం దాతలు అందించిన టీవీ, వాటర్ ఫిల్టర్, వాటర్ ట్యాప్‌లను ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సైదులు, కె.వెంకటేశ్వర్లు, గోవిందు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మినీ బ్యాంక్ సేవలు అభినందనీయం

మోతె : ఎస్‌బీఐ మోతె బ్రాంచ్‌కు అనుబంధంగా కొనసాగుతున్న సిరికొండ మినీ బ్యాంక్ సేవలు అభినందనీయమని సూర్యాపేట ఫైనాన్షియల్ మేనేజర్ మూర్తి అన్నారు. మంగళవారం మోతె ఎస్‌బీఐలో సీఎస్‌పీ కాంపాటి శ్రీనివాస్‌కు ఆయన బహుమతి అందజేసి మాట్లాడారు. మోతె ఎస్‌బీఐ మేనేజర్ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దు

చిలుకూరు : ఇంటింటి కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దని ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా రామాంజనేయులు కోరారు. మంగళవారం చిలుకూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్యుమరైటర్‌గా ఉన్న ఒ క్కో ఉపాధ్యాయుడికి 150 నుంచి 175 ఇళ్లు కే టాయించారని, ఒక్కో ఇంటిలో సమాచారం సేకరించేందుకు 45 నిమిషాల సమయం పడుతుందన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా సర్వే త్వరగా పూర్తి అయ్యేందుకు మరింత మంది ఎన్యుమరేటర్లను నియమించాలన్నారు.

రోడ్ల వెంటే వ్యర్థాల పారబోత

- సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను రహదారుల పక్కన వదులుతున్న క్లీనర్స్
- దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



గుడిబండ బైపాస్ వద్ద రోడ్డు మీద పారబోసిన సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు, చెత్త

కోదాడ : పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను ప్రధాన రోడ్ల వెంట పారబోస్తున్నారు. దీంతో దుర్గంధం వస్తుండడంతో నిత్యం రాకపోకలు సాగించే వేలాదిమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా పట్టణంలోని చెత్తను డంపింగ్ యార్డుకు చేర్చాల్సిన మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ఎక్కడ ఖాళీ ప్రదేశం కనపడితే అక్కడ పోస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ కమిషనర్ అది తన పని కాదన్నట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు అంటున్నారు.

దుర్గంధంతో ఇబ్బందులు

కోదాడ పట్టణంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేసే వారు ఐదారుగురు ఉన్నారు. వీరు సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదేశంలో వదలాల్సి ఉంటుంది. కానీ వీరు రాత్రి సమయాల్లో గుట్టు చప్పుడు కాకుండా రోడ్ల వెంట, పంట పొలాల పక్కన పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర దుర్గంధం భరించాల్సి వస్తోంది. అదేవిధంగా జంతు కళేబరాలు, మాంసం విక్రయించేవారు వాటి కళేబరాలను రాత్రి సమయాల్లో పట్టణంలోని బైపాస్ రోడ్డు వెంట సర్వీస్ రోడ్ల పక్కన పడేస్తున్నారు. వీటి కోసం అక్కడికి వచ్చే కుక్కలు ఆ ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అంతేకాకుండా ఆ కుళ్లిపోయిన మాంసం తింటున్న కుక్కలకు పిచ్చి లేచి ప్రజలను కరుస్తున్నాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సగం చెత్త రోడ్లపైకే..

ఇదిలా ఉండగా కోదాడ పట్టణంలోని వీధుల్లో సేకరించే చెత్తను మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోల్లో ప్రధాన రోడ్డు మీదుగా డంపింగ్ యార్డుకు చేరుస్తుంటారు. అయితే ట్రాక్టర్ ట్రాలీ నిండుగా చెత్త వేసుకొని వెళ్తున్న సిబ్బంది దానిపై పట్టా కప్పి తీసుకెళ్లాలి. కానీ పట్టాలు కప్పకుండా పట్టణ వీధుల్లో వెళ్తుండడంతో ట్రాలీలోని చెత్త సగం మళ్లీ రోడ్ల మీద పడుతుంది. ఈ చెత్త వాహనాల వెనుక వెళ్లే వారి మీద కంపుకొడుతున్న చెత్తచెదారం పడుతుందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు.

నిఘా పెడతాం

సెప్టిక్ ట్యాంక్‌ల యజమానులు వ్యర్థాలను రోడ్ల వెంట పారపోస్తున్నారని ఫిర్యాదులు రావడంతో జవాన్‌లతో నిఘా పెట్టాం. వారిని కూడా పిలిచి హెచ్చరించాం. మరోసారి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలు సీజ్ చేస్తాం. చెత్తను తరలించే ట్రాలీల మీద పట్టాలు కప్పే విధంగా చర్యలు తీసుకుంటాం.

– యాదగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోదాడ మున్సిపాలిటీ

రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



బరాఖత్‌గూడెంలో తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మునగాల : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో మునగాల సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు అధిక సంఖ్యలో ధాన్యం విక్రయించేలా కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం ఆయన మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి స్థానిక తహసీల్దార్ ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, మండల వ్యవసాయాధికారి బుంగా రాజు, ఆర్‌ఐ ఎస్.రామారావు, సొసైటీ సీఈఓ బసవయ్య, సిబ్బంది సుందరయ్య, రైతులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నేరేడుచర్ల : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీకి భూసేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతిక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కొండగల్ అర్బన్ డవలప్‌మెంటు అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిలపై దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురిగి సైదులు మాట్లాడుతూ.. అధికారులపై దాడి చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, ఆర్‌ఐ నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ చంద్రమ్మ, జూనియర్ అసిస్టెంట్ అబ్బాస్ సిబ్బంది ఉన్నారు.

బూరుగడ్డలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రోత్సవాల్లో చైర్మన్, ధర్మకర్తలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా ఆంజనేయ స్వామికి ఆకుపూజ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. రాత్రి ఆలయ పవిత్రోత్సవాలను ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సర్వేలో పూర్తి వివరాలు సేకరించాలి



హుజూర్‌నగర్ : ఎన్యుమరేటర్ నమోదు చేస్తున్న వివరాలు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ : సామాజిక సర్వేలో పూర్తి వివరాలు సేకరించాలని ఆర్‌డీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న సామాజిక సర్వేను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం సర్వే పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజలు సహకరించాలి..

పట్టణంలోని 25వ వార్డులో జరుగుతున్న సర్వేలో కాంగ్రెస్ నాయకుడు సులువ చంద్రశేఖర్ పాల్గొన్నారు. సామాజిక సాధికారత కోసం ప్రజా ప్రభుత్వం చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. నాయకులు, పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ సరిత

నడిగూడెం : విద్యార్థులు క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తహసీల్దార్ వి.సరిత అన్నారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆమె పరిశీలించి క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం పలు క్రీడల్లో గెలిచిన క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు చింతలపాటి వాణి, ఝాన్సీ, పద్మ, దున్నా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ వృత్తికి చేయూతనివ్వాలి



రంజిత్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న హుస్సేన్, తదితరులు

హుజూర్‌నగర్ : కనుమరుగవుతున్న ఫొటోగ్రఫీ వృత్తికి ప్రభుత్వం చేయూతనివ్వాలని ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ కోరారు. హుజూర్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన ఫొటోగ్రాఫర్ చిట్టిప్రోలు రంజిత్‌కు కుటుంబ భరోసా పథకం కింద మంజూరైన రూ.1.60 లక్షల చెక్కును మంగళవారం రంజిత్ కుటుంబ సభ్యులకు అందజేసి మాట్లాడారు. ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు మాధవరెడ్డి, యాదగిరి, రాపర్తి శ్రీనివాస్ గౌడ్, కూకుంట్ల లాలు, గొట్టం రవి, చేపూరి లక్ష్మణ్, కప్పల హరికృష్ణ, ఫొటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సాయిలక్ష్మి

గరిడేపల్లి : టైలరింగ్‌తో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని స్వామి రామానంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సాయిలక్ష్మి అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రంలో స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. మహిళలు కేవలం ఇంటి పని, వంట పనికే పరిమితం కాకుండా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జిగ్‌జాగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యాగ్ మేకింగ్ లాంటి వాటిల్లో శిక్షణ పొంది ఆదాయం సమకూర్చుకోవచ్చని అన్నారు. మూడు నెలలు నిర్వహించే ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి ఒక సెంటర్ ఏర్పాటు చేసి ట్రైనర్‌ను నియమించి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ హరికృష్ణ, కిషోర్, ట్రైనర్ రాగిరెడ్డి మంగ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 19 గొర్రె పిల్లలు, 7 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 26 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన చింతలపాలెం మండలం పులిచింతల ప్రాజెక్టు కాలనీలో మంగళవారం జరిగింది. వివరాలు.. పులిచింతల ప్రాజెక్టు కాలనీకి చెందిన ఆనంగి వెంకయ్య రోజు మాదిరిగానే సోమవారం రాత్రి తన ఇంటి సమీపంలో ఉన్న దొడ్డిలో తన గొర్రెలను తోలి తడకలు కట్టి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి కుక్కలు దాడి చేయడంతో 19 గొర్రె పిల్లలు 7 గొర్రెలు మృతిచెంది ఉన్నాయి. మరో 2 గొర్రెలకు తీవ్ర గాయాలై చావుబతుకుల మధ్యన కొట్టుమిట్టాడుతూ కనిపించాయి. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న పశువైద్యులు, పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కొమ్ము గురవయ్య కోరారు.

నష్టపోయిన బాధితులను ఆదుకోవాలి

మేళ్లచెరువు : చింతలపాలెం మండల నెమలిపురి కాలనీలో కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెంది నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు జనిగ సైదులు యాదవ్ కోరారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు.

ఉపాధ్యాయులకు సర్వీసు బుక్‌ల పంపిణీ



ఉపాధ్యాయులకు సర్వీసు బుక్‌లు పంపిణీ చేస్తున్న మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి

నేరేడుచర్ల : మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులకు మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాధికారి సత్యనారాయణరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, శ్రీనివాస్‌రావు సర్వీస్ బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గుణాత్మక విద్య, క్రమ శిక్షణ, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు వై.సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి మాతంగి సైదులు, మాజీ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మామిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, దీప్లానాయక్, చందమళ్ల వెంకన్న, కిసర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోదాడరూరల్ : ప్రతిఒక్కరూ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని కోదాడ ఫైర్ ఆఫీసర్ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. వంట గ్యాస్ ప్రమాద నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినపుడు నష్టనివారణ చర్యలు ఎలా చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి, అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.సరిత కోరారు. మంగళవారం నడిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, గ్రామీణావృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఐదు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేలా అవగాహన కల్పించాలన్నారు. క్వింటా ధాన్యానికి ప్రభుత్వం రూ.2320 కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్, ఏపీఎం రామలక్ష్మి, ఏఈఓలు పిచ్చయ్య, ఉప్పయ్య, మౌనిక, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం ,ప్రత్యేకార్చనలు చేశారు. ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణ తంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాల మహోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవారిని గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేకార్చనలు చేశారు. అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లు

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగిలాయని తాజా మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి విమర్శించారు. మంగళవారం మండలంలోని వేపలసింగారంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరి కోతలు ప్రారంభించి 15 రోజులవుతున్నా ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని, ఉన్న కేంద్రాల్లో అధిక తేమ పేరుతో కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.2800 నుంచి రూ.3200 వరకు గిట్టు బాటు ధరను కల్పించిందని తెలిపారు. ప్రస్తుతం క్వింటాకు ధర రూ. 2200 పడిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారని తెలిపారు. గిట్టుబాటు ధర చెల్లించకుండా మిల్లర్లు, దళారులు దోచుకుంటున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి రైతులకు గిట్టుబాటు ధర అందేలా చూడాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు సారెడ్డి భాస్కర్‌రెడ్డి, కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి, సాములు హరిలీలబ్రహ్మారెడ్డి, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శివాలయంలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి పీఠం వద్ద సోమవారం రాత్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో నరసింహస్వామి పీఠం చైర్మన్ మండాది వెంకయ్య, గురుస్వాములు ముత్యాలుస్వామి, వీరయ్య, పూజారులు రెంటాల సతీష్ శర్మ, వెంకటేశ్వరశర్మ, దీక్షా స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న ఏర్నేని వెంకటరత్నం, కుసుమ దంపతులు

కోదాడరూరల్ : కార్తీకమాస ఏకాదశి సందర్భంగా కోదాడ పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో గల శివాలయంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్నేని వెంకటరత్నంబాబు కుసుమ దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయ్యప్ప మాలధారణతో భక్తిభావం పెరగడంతో పాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధం



ముస్తాబైన శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయం

మోతె : మండలంలోని ఉర్లుగొండ గ్రామంలో పునర్నిర్మించిన పార్వతీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివార్ల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. ఈమేరకు సర్వం సిద్ధం చేశారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొండపల్లి గోపాల్‌రెడ్డి మంగళవారం స్థానికంగా విలేకరుల సమావేశంతో మాట్లాడారు. ఆలయంలో పార్వతీ సమేత నాగలింగేశ్వరస్వామి, గణపతి, కుమారస్వామి, నందీశ్వర, జంట నాగుల విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివార్లకు రుద్రాభిషేకం, మహాపూజ, మంగళహారతి, మంత్రపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు కొండపల్లి శేఖర్‌రెడ్డి, కొండపల్లి జితేందర్‌రెడ్డి, కొండపల్లి విజయేందర్‌రెడ్డి, కొండపల్లి రవీందర్‌రెడ్డి, కొండపల్లి అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి నివాళి

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి తండ్రి వెంకటరెడ్డి (87) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని టీపీసీసీ సభ్యులతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, ఇర్ల సీతారాంరెడ్డి, ఎండీ. రఫి, నర్సింహారెడ్డి, నాగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, పులి రాజారావు, యాకూబ్ తదితరులు ఉన్నారు.

చేపపిల్లలు పంపిణీ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండంలోని కిష్టాపురం గ్రామం వద్ద కృష్ణానదిలో మంగళవారం మత్స్య శాఖ సిబ్బంది, నాయకులు చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరాల కొండారెడ్డి, రవీంద్ర, కాశయ్య, వెంకటరెడ్డి, దాదాబుడే, జానీ, వెంకట్రావు, మున్నా, మత్స్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చింతకాయల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలలో వెనుకబడిన వర్గాలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను ఓర్వలేక వారి స్వార్థం కోసం కొన్ని రాజకీయ పార్టీలు అక్కడక్కడ అధికారులకు సహకరించడం లేదని వాపోయారు.

అలంకారప్రాయంగా కొనుగోలు కేంద్రాలు

మునగాల : గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ ఆరోపించారు. మంగళవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో కొర్రీలు పెడుతుండడంతో రైతులు ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా లేరన్నారు. దీనిని ఆసరాగా చేసుకొని రైస్ మిల్లుల యజమానులు, దళారులు సిండికేట్ అయి రైతులను నిలువు దోపిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కనీసం ఒక్క రైతుకైనా రూ.500 బోనస్ చెల్లించారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి లేనిపోని నిబంధనలు పెట్టకుండా కొనుగోలు చేసి మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలని కోరారు.